క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రంగనాథస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కందుకూరు: మండలంలోని కొత్తగూడ పరిధి సీతారామశాస్త్రినగర్‌లో భోగి పండుగను పురస్కరించుకొని గణపతి, లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్త తూళ్ల వినాయకరావు ఆధ్వర్యంలో సోమవారం శ్రీగోదా రంగనాథస్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య గోదాదేవి, రంగనాథ స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నియామకం



అంజిరెడ్డిని సన్మానిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు: బీజేపీ నూతన మండల అధ్యక్షుడిగా కందుకూరుకు చెందిన నిమ్మ అంజిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అంజిరెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం అంజిరెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు ఏ.అశోక్‌గౌడ్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా తన శ్రాయశక్తులా కృషి చేస్తానన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



డ్యాన్సులు చేస్తున్న చిన్నారులు

బడంగ్‌పేట్: సింగపూర్ టౌన్‌షిప్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం క్రిసాలిస్ చార్మ్ పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లెఫ్టినెంట్ కల్నల్ లక్ష్మణ్ గణేశ్, ప్రఖ్యాత కేరీర్ కౌన్సిలర్ సుధీర్ సాండ్రా, నేపథ్యగాయని సమీరా భరద్వాజ్, విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమురయ్య, సూర్య చంద్రకాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రామస్తుతి ప్రార్థనతో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక పదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గగన్‌దీప్ ధిల్లాన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ పాలకవర్గం ఏర్పాటు

నూతన కమిటీ జాబితాను అందజేసిన ఎమ్మెల్యే



నూతన కమిటీ జాబితాను అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: పట్టణంలోని గ్రేడ్–1 గ్రంథాలయం అభివృద్ధి కమిటీ నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో నూతన పాలకవర్గ జాబితాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పారదర్శకత, ప్రాముఖ్యతతో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 19న నిర్వహిస్తామని తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి జూపల్లికృష్ణారావు హాజరు కానున్నారని తెలిపారు. కమిటీ చైర్మన్‌గా మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్లుగా నక్క బాల్‌రాజ్ యాదవ్, వీరేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా క్యూసెట్ శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా చంద్రశేఖర్, అనిల్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుదర్శన్‌గౌడ్, సభ్యులుగా జుట్టు అనిల్‌కుమార్, ఫయాజ్, చంద్రశేఖర్‌అప్ప, రాజేశ్, కృష్ణారెడ్డి, శివరాములుయాదవ్, రాజుగౌడ్, రవినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, బాబర్‌ఖాన్, అగ్గనూరి విశ్వం, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, బస్వం అప్ప, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు కొత్తరూపు

- కొత్తూరులో ఊపందుకున్న రోడ్డు విస్తరణ పనులు
- వైజంక్షన్ నుంచి పాత జాతీయ రహదారి పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, స్థానికులు



పూర్తయిన వై జంక్షన్-రైల్వే వంతెన రోడ్డు



వేగంగా జరుగుతున్న పూలే-జేపీదర్గా రోడ్డు పనులు

కొత్తూరు: పట్టణంలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడం.. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కాగా గతేడాది ప్రారంభమైన రోడ్డు వెడల్పు పనులు పూర్తికావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు నెమ్మదిగా తగ్గుతున్నాయి. పట్టణ సమీపంలోని వైజంక్షన్ కూడలి నుంచి పాత జాతీయ రహదారి మీదుగా షాద్‌నగర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో గతంలో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తాత్కాలికంగా గుంతలను పూడ్చడానికి నాయకులు మట్టిని పోయడంతో వాహనాల రాకపోకల సమయంలో విపరీతమైన దుమ్ము కారణంగా పట్టణంలో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వైజంక్షన్ కూడలి నుంచి రైల్వే వంతెన వరకు సీసీరోడ్డు పనులు పూర్తికావడంతో వ్యాపారులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా రోడ్డు పనులు

కొత్తూరు పట్టణంలో ఇప్పటికే జాతీయ రహదారి వైజంక్షన్ కూడలి నుంచి రైల్వే వంతెనవరకు సుమారు రూ.5 కోట్లతో చేపట్టిన నాలుగు లేన్ల రోడ్డు పనులు పూర్తయ్యాయి. హెచ్‌ఆర్‌డీసీ నిధులు రూ.18కోట్లతో గత నెలలో పట్టణంలోని పూలే విగ్రహం నుంచి వినాయక స్టీల్ కూడలి, ఎస్సీ కాలనీ నుంచి చేగూరు వరకు సుమారు రూ.32కోట్లతో చేపడుతున్న రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనులు పూర్తయితే పట్టణం నుంచి జాతీయ రహదారి, కుమ్మరిగూడ, ఫాతిమాపూర్, అక్కివానిగూడ, చేగూరు వెళ్లే వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

స్థానికుల హర్షం..

కొత్తూరు పట్టణంలో పారిశ్రామికవాడ ఉండడంతో ఇక్కడ నివాసం ఉండే వారితో పాటు ఆయా ప్రాంతాల నుంచి నిత్యం ఎంతో మంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. పట్టణంలో సుమారు 18 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. జనాభాకు తగ్గట్లుగా మార్కెట్ సదుపాయం అందుబాటులో లేని కారణంగా చిరు వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారులు కొనసాగిస్తున్నారు. అసలే రోడ్లు ఇరుకుగా ఉండడం చిరు వ్యాపారులు కొంతమేర ఆక్రమిస్తుండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం పట్టణంలో ఎక్కువగా రద్దీ ఉండే పెంజర్ల, పాత జాతీయ రహదారి రోడ్డు పనులు పూర్తయ్యాయి. జేపీదర్గా, కుమ్మరిగూడ రోడ్డు పనులు సాగుతున్నాయి. రోడ్డు పనులు పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందులు తీరడంతో పాటు పట్టణం కొత్త రూపాన్ని సంతరించుకుంటుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పనులకు సహకరించాలి



పట్టణంలో ఇరుకుగా ఉన్న రోడ్ల విస్తరణ పనులు వ్యాపారులు, భవనాల యజమానులకు ఇబ్బందులు లేకుండా జరుగుతున్నాయి. కొత్తగా విస్తరిస్తున్న రోడ్డు పనులకు ప్రజలు సహకరించాలి. రోడ్డు సౌకర్యం బాగుంటేనే పట్టణం మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది.

– సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ నేత, కొత్తూరు

గడువులోగా పనులు పూర్తి



కొత్తూరు మున్సిపాలిటీలో హెచ్‌ఆర్‌డీసీ నిధులతో చేపట్టిన జేపీదర్గా, కుమ్మరిగూడ రోడ్ల పనులను గడువులోగా పూర్తిచేసే విధంగా కాంట్రాక్టర్‌కు సూచించాం. ఇప్పటికే పెంజర్ల, వై జంక్షన్ కూడలి నుంచి రైల్వే వంతెన వరకు సీసీరోడ్డు పనులు పూర్తిచేశాం. రోడ్డు విస్తరణ పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

ఘనంగా భోగి సంబురాలు



కందుకూరు చౌరస్తాలో భోగి మంటలు వేస్తున్న స్థానికులు

కందుకూరు: మండల పరిధిలో భోగి పండుగను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయమే ఆయా గ్రామాల్లో చిన్నా, పెద్ద అంతా ఒక దగ్గర చేరి కూడళ్లు, ఇళ్ల వద్ద భోగి మంటలు వేసి పండుగను ఆస్వాదించారు.

కార్పొరేట్ సేవలతో జీవన ప్రమాణాలు మెరుగు



మీర్‌ఖాన్‌పేటలో పునరుద్ధరించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, అమేజాన్ సంస్థ ప్రతినిధులు

ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: కార్పొరేట్ సంస్థలైన అమేజాన్ వంటి సంస్థలు సమాజాభివృద్ధిలో కీలక భూమిక పోషించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే సబితారెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో అమేజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆ సంస్థ గ్లోబల్ డేటా సెంటర్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ సెర్జియో లొరెయిరో, ఏషియా పసిఫిక్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా డేటా సెంటర్ ఆపరేషన్స్ డైరెక్టర్ సాజీ పీకే, ఇండియా డేటా సెంటర్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఆదిత్య చౌదరితో కలిసి ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఓపెన్ జిమ్, జాగింగ్ ట్రాక్, ఆర్‌ఓ ప్లాంటు, పునరుద్ధరించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్పొరేట్లు సమాజ సేవలో భాగంగా చేపట్టే పనులతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. అమేజాన్ వెబ్ సర్వీస్ సంస్థ చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ద్వారా సమాజంపై సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో గ్రామాల్లోని అన్ని వర్గాలకు ప్రయోజనాలు అందుతాయన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

- విజయంకోసం కృషి చేయాలి
- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న అనితారెడ్డి తదితరులు

మహేశ్వరం: ఆటల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని, ఓటమి చెందామని కుంగి పోకుండా.. విజయం కోసం కృషి చేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండల పరిధి పెండ్యాల గ్రామంలో నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మదిలపురం ప్రేమలమ్మ, జైత్వారం నారాయణరెడ్డిల జ్ఞాపకార్థంగా వారి కుమారులు జగత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కబడ్డీ పోటీలు.. సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు అనితారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. గ్రామంలో 25 సంవత్సరాలుగా క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి, క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో సుమారు 60 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో మన్సాన్‌పల్లి ఎంఆర్‌ఆర్ వర్సెస్ రామచంద్రగూడ జట్ల మధ్య జరిగిన పోటీలో విన్నర్‌గా మన్సాన్‌పల్లి ఎంఆర్‌ఆర్, రన్నర్‌గా రామచంద్రగూడ టీంలు నిలిచాయి. టక్కఫర్ పోటీలో విన్నర్‌గా ఎన్టీఆర్‌తండా, రన్నర్‌గా పెండ్యాగ్రామం నిలిచింది. కబడ్డీ విజేతకు మొదటి బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేల నగదుతో జ్ఞాపిక ప్రదానం చేశారు. మూడు, నాలుగో స్థానంలో నిలిచిన జట్లు నగదు బహుమతులు అందుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు జగన్‌మోహన్ రెడ్డి, నారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి, బాల్‌రాజ్, అంజయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు గోదాదేవి కల్యాణం

కొత్తూరు: మండలంలోని పెంజర్ల గ్రామంలో ప్రసిద్ధి గాంచిన అనంత పద్మనాభస్వామి ఆలయంలో నేడు(మంగళవారం) గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని దైవకృపను పొందాలని వారు కోరారు.

ఉచిత వైద్య శిబిరం




వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేడికవర్ ఆస్పత్రి డాక్టర్ అచ్చుత్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 310 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కాలేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, శ్రీకాంత్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

సర్వే రెమ్యూనరేషన్ వెంటనే ఇవ్వాలి

ఎస్‌జీటీ జిల్లా అధ్యక్షుడు గణేశ్

చేవెళ్ల: గత నవంబర్‌లో ప్రైమరీ స్కూల్ టీచర్లతో రాష్ట్ర వ్యాప్తంగా చేయించిన కులగణన సర్వేకు సంబంధించిన రెమ్యూనరేషన్‌ను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని ఎస్‌జీటీ జిల్లా అధ్యక్షుడు గణేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం వారు చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. సర్వే కాలానికి సంబంధించిన రిమ్యూనరేషన్‌ను విడుదల చేసినట్లు ప్రభుత్వం లెక్కలు చూపించినా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల ఖాతాల్లో ఇంతవరకు డబ్బులు జమ కాలేదన్నారు. ఎన్యుమరేటర్లకు రూ.10వేలు, సూపర్‌వైజర్లకు రూ.12 వేలు ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ మేరకు డబ్బులను వెంటనే విడుదల చేయాలన్నారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ గణేశ్

చేవెళ్ల: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌జార్జి సీఐ గణేశ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం చేవెళ్లలో వాహనదారులు, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు సిగ్నల్స్‌ను చూసుకొని వెళ్లాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన శిక్షలు, చలాన్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్సై చందర్‌నాయక్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



మీర్‌పేట: విజేతలకు బహుమతులు అందజేస్తున్న సహకార సంఘం సభ్యులు



కందుకూరు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అండేకార్ సురేందర్, నాయకుడు అర్చన రాజు ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఇలాంటి కార్యక్రమాలతో మన సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు మార్గదర్శకంగా ఉంటాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌లు గొరిగె రాజు, ఎడ్ల రాంరెడ్డి, నాయకులు రావుల జంగయ్య, గుర్రం యాదగిరి, అల్లం శ్రీకాంత్, రావుల సురేష్, బొక్క భూపాల్‌రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి, పి.వెంకటేశ్‌గౌడ్, డి.నర్సింహ, శ్రీశైలం, సిద్ధార్థ, వెంకటరమణారెడ్డి, ఆర్.మహేశ్, రితీశ్, మహేశ్, జి.ప్రవీణ్, ఎ.అమరేందర్‌రెడ్డి, ఎస్.ప్రభు, ఐలయ్య, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యకళానగర్‌లో..

మీర్‌పేట: సంక్రాంతి పండుగ సందర్భంగా మీర్‌పేట భాగ్యకళానగర్‌లో భాగ్యకళ సహకార సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక అంగన్‌వాడీ టీచర్లు సంగీత, కవిత, సుకన్యలు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీకగా నిలుస్తాయన్నారు. అనంతరం ఉత్తమ ముగ్గులను ఎంపికచేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బత్తిని గణేశ్, జి.వెంకటరమణ, డి.భాస్కర్, పాండు, కంబాళపల్లి గణేశ్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం



యాదిశ్, మహేశ్వరం అధ్యక్షుడు

మహేశ్వరం: బీజేపీ మహేశ్వరం మండల అధ్యక్షుడిగా డబిల్‌గూడ గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు తెలగమల్ల యాదిశ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదిశ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

మున్సిపల్ అధ్యక్షులు వీరే..

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ అధ్యక్షుడు–1గా బడంగ్‌పేటకు చెందిన రాళ్లగూడం రామకృష్ణారెడ్డిని, పార్టీ బడంగ్‌పేట్ మున్సిపల్ అధ్యక్షుడు–2గా అల్మాస్‌గూడకు చెందిన రామిడి వీరకర్ణారెడ్డిని నియమించారు. వీరితో పాటు జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా బాలాపూర్‌కు చెందిన జోరల ప్రభాకర్, వినాయకహిల్స్ కాలనీకి చెందిన జి.శివారెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో నూతన అధ్యక్షులను పార్టీ నాయకులు శాలువాలతో సన్మానించారు. పార్టీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, నిమ్మల రవికుమార్‌గౌడ్, శూరకర్ణారెడ్డి ఉన్నారు.



హుడాకాంప్లెక్స్: నూతన అధ్యక్షుడు నర్సింహారెడ్డిని సత్కరిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

మీర్‌పేట అధ్యక్షుడిగా భిక్షపతి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడిగా 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి సోమవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. అదేవిధంగా జిల్లెలగూడ అధ్యక్షుడిగా తులసి ముఖేశ్‌ముదిరాజ్ కూడా నియమితులయ్యారు.

సరూర్‌నగర్ అధ్యక్షుడిగా మిట్టపల్లి

హుడాకాంప్లెక్స్: బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా మిట్టపల్లి నర్సింహారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ అధికారి లక్ష్మీనారాయణ సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిని ఆమె నివాసంలో కలిశారు.